


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 12-04-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 184 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాల్సింది

# ఓటర్లే

- ఉండవల్లిలో ఓటు వేసిన చంద్రబాబు
- ప్రశాంతంగా ఓటింగ్ సరళి
- ఈవీఎం వైఫల్యాలతో విసుగు
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి: రాష్ట్రంలో జరుగుతున్న పోలింగ్ సరళిని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు ఆయన ఓ విజ్ఞాపన చేశారు. ప్రజలంతా స్వేచ్ఛగా, నిర్భీతిగా ఓటు వేయాలని పిలుపు నిచ్చారు. ఓటమి భయంతో ఓటింగ్ శాతం తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ తరుణంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత ఓటర్లదేనని చెప్పారు. రాష్ట్రం కోసం పెద్దఎత్తున ఓటర్లు బారులు తీరారని.. ఈవీఎంల వైఫల్యాల వల్ల విసుగు చెంది వెనక్కి వెళ్లారని తెలిపారు. వారంతా మళ్లీ ఓపిగ్గా పోలింగ్ బూత్‌కు రావాలని ఓటర్లను వినమ్రంగా అభ్యర్థించారు. రాష్ట్రం కోసం ఈ ఒక్క రోజు కష్టపడాలని సీఎం కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓట్లు వేయకుండా ప్రజల్ని ఏ శక్తీ ఆపలేదన్నారు. ఇంకా ఓటు వేయని వారు పోలింగ్ బూత్‌లకు చేరుకోవాలని కోరారు. ఓటింగ్‌ను అడ్డుకోవాలని తరువాయి 2లో..

## ఓటేసిన పవన్..

### ఈవీఎంల మొరాయింపుపై అసంతృప్తి

### జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్



విజయవాడ: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. విజయవాడలోని పటమటలో ఓటు వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరగాలని ఆకాంక్షించారు.

అనంతపురంలో ఆ పార్టీ అభ్యర్థి మధుసూదన్ గుప్తా ఈవీఎంను ధ్వంసం చేయడంపైనా ఆయన స్పందించారు. ఈ చర్య తప్పిదమేనని.. అయితే, వాస్తవంగా అక్కడ ఏం జరిగిందనేది తెలుసుకోవాల్సి ఉందని వ్యాఖ్యానించారు. తరువాయి 2లో..

### నిర్భయంగా ఓటేయడంతోనే

## సమాజంలో మార్పు

- ప్రతీ ఒక్కరూ ఓటు వేయాలి
- ఏపీ ప్రజలు మార్పుకోరుకుంటున్నారు
- వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి



కడప : సమాజంలో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. కడప జిల్లా పులివెందులలో వైఎస్ జగన్, ఆయన భార్య వైఎస్ భారతి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సమాజంలో మార్పు రావాలంటే ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. నిర్భయంగా ఓటు వేయాలని, మార్పు కోసం ఓటు వేయాలని జగన్ అన్నారు. ఏపీ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, దేవుని దయవల్ల రాష్ట్రంలో మార్పు వస్తుందని ఆశిస్తున్నాని చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. దీంతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల దగ్గర బారులు తీరారు. ఏపీలో మొత్తం 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. సాయంత్రం 6 గంటలవరకు పోలింగ్ జరగనుంది.



## అవినీతికి అడ్డుకట్ట వేస్తాం

- వారసత్వ రాజకీయాలు సాగనివ్వం
- పోలింగ్‌లో నిర్భయంగా పాల్గొనండి
- ప్రతిపక్షాలు భయపడుతున్నాయి
- ప్రధాని నరేంద్ర మోదీ

భగల్‌పూర్: తాను తిరిగి అధికారంలోకి వస్తే వారి ఆటలు సాగవని.. అందుకే తనను ఓడించాలని చూస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ఈ విషయంలో విపక్షాల్లో ఇప్పటికే భయం మొదలైందన్నారు. 2014కి ముందు పాకిస్థాన్ అనేక సార్లు భారత్‌లో దాడులు చేసేదని.. ఇప్పుడు ఆ దిశగా ఆలోచించడానికి కూడా సాహసించడం తరువాయి 2లో..

## ఏపీ పోలింగ్‌లో హింసాత్మక ఘటనలు

- తెదేపా, వైకాపా వర్గాల మధ్య ఘర్షణ
- ఒకరి మృతి.. పలువురికి గాయాలు
- వైకాపా దాడి.. సొమ్మసిల్లిన కోడెల
- వైకాపా దౌర్జన్యాలు ముందే ఊహించా
- నాకే ఇలా అయితే.. సామాన్యుడి పరిస్థితి?
- సభాపతి కోడెల శివప్రసాదరావు



అమరావతి: సిరాచుక్క పడాల్సిన చోట.. రక్తం చిందింది. అన్నదమ్ముల్లా మెలిగే గ్రామాల్లో హింస చెలరేగింది. రాళ్లదాడులు, కర్రదాడులు, చొక్కాలు చింపేయడాలు.. ఇవీ ఏపీలో కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియకు నిదర్శనాలు. రాష్ట్రంలో పలు చోట్ల తెదేపా, వైకాపా వర్గాల మధ్య జరిగిన దాడులతో పోలింగ్ హింసాత్మకంగా మారింది. పలు చోట్ల కర్రలు, రాళ్ల దాడులు జరగడంతో ఒకరు మృతిచెందారు. పలువురికి గాయాలయ్యాయి.

**సభాపతిపై దాడి..**

గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం ఇనిమెట్లలో సభాపతిపై వైకాపా వర్గీయుల దాడి చేసి చొక్కా చించివేశారు. పోలింగ్ బూత్‌లోకి కోడెల వెళ్లడంపై వైకాపా కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తంచేశారు. అనంతరం రెండు తరువాయి 2లో..




## తెలంగాణలో ముగిసిన పోలింగ్



హైదరాబాద్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తెలంగాణతో పాటు అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, సిక్కిం, త్రిపుర, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్‌లలో పోలింగ్ ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. 185 మంది అభ్యర్థులు బరిలో ఉన్న నిజామాబాద్ స్థానంలో మాత్రం సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. మహారాష్ట్ర సరిహద్దులో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలున్న తెలంగాణలోని 13 నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్‌ను ముగించారు. నిర్ణీత సమయంలోపు క్యూలైన్లకు చేరుకున్నవారిని ఓటు వేసేందుకు అనుమతిస్తున్నారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం తక్కువగా నమోదైనట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్నం 3 గంటల వరకు 48.95 నమోదయినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.



ఓటేసిన సినీ ప్రముఖులు.. వార్త 6వ పేజీలో..



# ఆకట్టుకున్న గాంధీనగర్ మోడల్ పోలింగ్ స్టేషన్





కాకినాడ : పండుగ వాతావరణంలో పోలింగ్ కాకినాడ గాంధీనగర్లోని మల్లయ్య అగ్రహం మున్సిపల్ కార్పోరేషన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్లు పలువురును ఆకట్టుకున్నాయి. ఈ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను పండుగ రీతిలో పూలతో అలంకరించి ఓటర్లు కూర్చోవడానికి అనువుగా కూలర్లు ఏర్పాటు చేసారు. పోలింగ్ కు వచ్చే ఓటర్లకు మంచినీరు, స్వీటుల పంపిణీతో పాటు గులాబిపూలతో స్వాగతం పలకడం పలువురుని ఆశ్చర్యానికి గురి చేసింది. పోలింగ్ స్టేషన్ ప్రాంగణంలో పచ్చని తివాచీలు పర్చడంతోపాటు దివ్యాంగుల ఓటర్లకు సహాయకులు మరియు వీల్ ఛైర్ సౌకర్యం కల్పించారు. ఈ పోలింగ్ స్టేషన్లను జిల్లా కలక్టర్ కార్తి కేయమిశ్రా కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు డా.ఆర్.నందగోపాల్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగ ఓటరైన కోటిపల్లి నూకలమ్మను పోలింగ్ స్టేషన్ లోనికి వీల్ ఛైర్ లో కలక్టర్ కార్తి కేయమిశ్రా స్వయంగా తీసుకొని వెళ్లి ఓటు వేయడానికి సహాకరించారు. ఈ సందర్భంగా నూకలమ్మను కేంద్ర పరిశీలకులు డా. ఆర్.నందగోపాల్ పూలతో అభినందించారు. వీరి వెంట కాకినాడ ఆర్డిఓ జి.రాజకుమారి కూడా వున్నారు. ఓటు వేసిన కలెక్టర్ కార్తి కేయ మిశ్రా దంపతులు. :- జిల్లాకలక్టర్ కార్తికేయమిశ్రా దంపతులు కాకినాడలోని శ్రీనగర్ బాలికోన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ పాఠశాలలోని 22 పోలింగ్ స్టేషన్ లో కలక్టర్ దంపతులు క్యూ లో నిలబడి తమవంతు వచ్చే వరకు వేచివుండి ఓటు వేసారు. అదే సమయంలో అక్కడకు విచ్చేసిన ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు. క్యూలో నిలబడ్డ కలక్టర్ దంపతులతో సెల్ఫీలు తీసుకోవడానికి పలువురు ఉత్సహం చూపించగా వారితో కలక్టర్ దంపతులు సెల్ఫీలు దిగారు.

# తాళ్లరేవులో 70శాతం ఓటింగ్ నమోదు

## ఈవీఎంల మొరాయింపులతో ఇబ్బంది పడిన ఓటర్లు

తాళ్లరేవు : ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో చెదురు మదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. గురువారం తాళ్లరేవు మండలంలో 75 పోలింగ్ కేంద్రాలలో 7 గంటల నుండి పోలింగ్ ప్రారంభమైంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో వుంది. మండలంలో 12 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు వుండగా వాటిలో గాడిమొగ, సుంకరపాలెం, రామన్నపాలెం, తాళ్లరేవు అత్యంత సమస్యాత్మక కే&ంరదాలు వద్ద పోలీసు బలగాలను మొహరించారు. మిగిలిన పోలింగ్ కేంద్రాల వద్ద ఒక పోలీసును కూడా ఏర్పాటు చేయలేదు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బార్లు తీరి నిలుచున్న వారికి ఎండ తగలకుండా ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బారులు తీరిన ఓటర్లు లైను వద్ద టీడీపీ నాయకులు టీడీపీకి ఓటు వేయాలని ప్రచారం చేసినా అధికారులు పట్టించుకోలేదు. అలాగే వైఎస్ఆర్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించలేదు. పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ, వైఎస్ఆర్సీపీ కార్యకర్తల మధ్య మాటల యుద్ధం అనేక చోట్ల చోటు చేసుకున్నాయి. 3గంటల సమయానికి 62శాతం ఓట్లు పోలైయ్యాయి. కొన్ని చోట్ల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యం అయింది. చినబొడ్డు, వెంకటయ్యపాలెం, పి.మల్లవరంలో పోలింగ్ మధ్యాహ్నం ప్రారంభమయ్యింది. ఆయా రాజకీయ పార్టీల నాయకులు వాహనాలపై ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్దకు తరలించారు. తాళ్లరేవు ఎంపిపి అనంతలక్ష్మి సీతారామపురం పోలింగ్ కేంద్రరంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. తాళ్లరేవు మార్కెట్ కమిటీ ఛైర్మన్ మందాల గంగ సూర్యనారాయణ బొల్లంగి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. తాళ్లరేవు రెవెన్యూశాఖ తహశీల్దార్ జె.విమల కుమారి పోలింగ్ సరళిని మండలంలో తిరిగి పర్యవేక్షించారు. కోరంగి ఎస్ఐ హరీష్ భద్రత ఏర్పాట్లును పర్యవేక్షించారు. పోలింగ్ సరళిని అధికారులు చెప్పడంలో పూర్తిగా విఫలమయ్యారు. పి.మల్లవరం పంచాయితీ పత్తిగొంది రెండు పోలింగ్ కేంద్రాలలో 746 ఓట్లకు 642 సీట్లు పోలయ్యాయి. రెండు పోలింగ్ కేంద్రంలో 925 సీట్లుకు గాను 844 ఓట్లు పోలయ్యాయి. సమాచారం ఇవ్వడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించారు. మండలంలో 62,309 ఓటర్లు వుండగా ఎన్ని పోలైయ్యాయి అన్నవి వివరించలేదు.

## పోలింగు కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ



విజయనగరం: జిల్లా ఎస్పీ శ్రీ ఎ.ఆర్. దామోదర్ మరియు ఆయన సతీమణి శ్రీమతి రూపా దామోదర్లు తమ ఓటు హక్కును విజయనగరం పట్టణంలోని నాగోజీపేట 101 నెంబరు పోలింగు కేంద్రంలో గురువారం నాడువినియోగించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ మాట్లాడుతూ - ఓటు హక్కు అన్నది చాలా విలువైనదని, ప్రతీ ఒక్కరూ ప్రజా స్వామ్య పద్ధతిలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ జిల్లా ప్రజలను కోరారు.అనంతరం విజయనగరం అసెంబ్లీ నియోజక వర్గంలోని నాగోజీపేట, జన్నగుడ్డి, దాసన్నపేట, లంకాపట్నం, చెల్లూరు, సుంకరి పేట పోలింగు కేంద్రాలను, నెల్లిమర్ల నియోజక వర్గంలోని నెల్లిమర్ల, జరజాపేట పోలింగు కేంద్రాలను, గజపతి నగరం నియెజక వర్గంలోని గొట్లాం, బండపల్లి పోలింగు కేంద్రా లను జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ సందర్శించి,భద్రతా ఏర్పాట్లును పర్యవేక్షించారు. బందోబస్తుకు నియమించబడిన పోలీసు సిబ్బందిని అక్కడ పరిస్థితులును గురించి అడిగి తెలుసుకున్నారు. జర్జాపుపేట పోలింగు కేంద్రంవద్ద ఇరు పార్టీలకు చెందిన స్థానిక నాయకులు పరస్పరంచేసుకున్న ఆరోపణలపై తక్షణం స్పందించి, ఇరు పార్టీలకు చెందిన వారిని పోలింగు కేంద్రంకు 200మీటర్లు వరకు బయటకు పంపివేసారు. దివ్యాంగులు, నడవలేని వృద్ధులకు పోలింగు కేంద్రాలు వద్ద వీల్ చైర్లను ఏర్పాటు చేసినట్లు, వాటిని వినియోగించుకోవాలని వారికి జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లా కలెక్టరు కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగు ద్వారా జిల్లా కలెక్టరు ఎం. హరి జవహర్లాల్, ఎన్నికల పరిశీలకులు/అదనపుడిజి అంబేద్కర్లతో కలసి జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ కాసేపు పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ వెంట స్పెషల్బ్రాంచ్ సిఐ జి. రామకృష్ణ మరియు ఆక్టోపస్కు చెందిన పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఎపిఆర్జెసి డిసి 2019 దరఖాస్తు గడువు ఏప్రిల్ 15 వరకు పొడిగింపు

విజయనగరం : ఎపిఆర్జెసి ఆర్డిసి 2019 ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరుతేదీ ఏప్రిల్ 15 వరకు పొడిగించడం జరిగిందని ఎపిఆర్జెసి తాటిపూడి ప్రిన్సిపాల్ మరియు జిల్లా కోఆర్డినేటర్ పి.పుల్లయ్య తెలియజేశారు. ప్రవేశ పరీక్ష 2019 మేనెల 9వ తారీఖున నిర్వహించడం జరుగుతుందని, దరఖాస్తు చేసుకొనుటకు ఆన్లైన్ వెబ్సైట్లో దరఖాస్తు రుసుం 250 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్టికెట్ మేనెల1వ తేదీ నుండి 8వ తేదీ వరకు వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు డౌన్లోడు చేసుకున్నహాల్టికెట్లను తీసుకుని పరీక్షకు హాజరు కాగలరని, పరీక్షలు జిల్లా కేంద్రంలో మే 9వ తేదీన ఉదయం10 గంటల నుండి 12.30 గంటల వరకు నిర్వహించడం జరుగు తుందని తెలిపారు.

## 14న శ్రీ సీతారామ కల్యాణం

విశాఖపట్నంః గోవిందరోడ్డు, వేంకటేశ్వరమెట్టపై వేంచేసియున్న శ్రీ రాంరాం మందిరం శ్రీ రామాలయంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్స్వామి మంగళాశాసనములతో శ్రీ హరేరామ సంకీర్తన భక్తబృందం వారి ఆధ్వర్యంలో రాంరాం మందిరం వ్యవస్థాపక ధర్మకర్త సుధా రామయ్యమ్మ సారథ్యంలో లోక కల్యాణార్థం ఈ నెల 14వ తేది ఉదయం గం॥ 10.35 ని॥లకు 64వ శ్రీ సీతారామ కల్యాణం నిర్వహిస్తున్నట్లు సంస్థ ఉపాధ్యక్షుడు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. మధ్యాహ్నం మట్టపల్లి హనుమంతరావు మరియు ధర్మకర్తల ఆధ్వర్యంలో నారాయణ సేవ జరుగుతుందన్నారు.

# మహిళా అభివృద్ధే దేశప్రగతికి నాంది

### - జిల్లా కలెక్టర్ ఎం.హరిజవహర్లాల్

విజయనగరం: సమాజం అభివృద్ధిచెందాలంటే మహిళల విద్య ఎంతో అవసరమని ఆ లక్ష్యసాధనలతో మహాత్మ జ్యోతి రావు పూలే కృషిచేశారని జిల్లా కలెక్టర్ ఎం.హరిజవహర్లాల్ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జన్మదినోత్సవం సందర్భంగా గురువారం కలక్టరేట్లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూలే తన భార్యకు విద్య నేర్పి టీచర్గా మలిచి ఆదర్శంగా నిలిచారన్నారు. బాల్యవిహాహాలు అరికట్టారని, అంటరానితనం రూపుమాపి బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కృషిసల్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిబిసి, ఓబిసి సంక్షేమ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి భూషణరావు, కార్యదర్శి భాస్కరరావు, అడ్వైజర్ ఉపాధ్యక్షులు రామచంద్రరావు, పద్మనాభం, క్లాస్-4 అధ్యక్షులు గంగా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

## ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాల్సింది ఓటర్లే

వైకాపా చేస్తున్న కుట్రలను విఫలం చేయాలని పిలుపునిచ్చారు. ఓటు వేయకపోతే అరాచకాన్ని ప్రోత్సహించినట్టే అవుతుందని చెప్పారు. భావితరాల భవిష్యత్తు ఓటుపైనే ఆధారపడి ఉందని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేశారు.

ఉండవల్లిలో ఓటు వేసిన చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఉండవల్లిలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయనతో పాటు ఆయన సతీమణి భువనేశ్వరి, తనయుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అందరూ ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని అన్నారు. ప్రతి ఒక్కరరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఓటు వేయడం మన బాధ్యత అని అన్నారు.

## ఓటేసిన పవన్..

పూర్తి వివరాలు తెలియకుండా దీనిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయనని చెప్పారు. రాష్ట్రంలో పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంపైనా ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు.

## అవినీతికి అడ్డుకట్ట వేస్తాం

లేదన్నారు. ఈ ఐదేళ్లలో దేశంలోని పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని అభిప్రాయపడ్డారు. మోదీ మరోసారి అధికారంలోకి వస్తే వారి అవినీతికి పూర్తిగా అడ్డుకట్ట పడుతుంది. వారి వారసత్వ రాజకీయాలు సాగవు. పేదల పేరిట దోచుకోవడం ఆగిపోతుంది అని కాంగ్రెస్ను ఉద్దేశించి మోదీ నిప్పులు చెరిగారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బిహార్లోని భగల్పూర్లో జరుగుతున్న ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు.

ఎన్డీయే పాలనలో భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చామని మోదీ తెలిపారు. కానీ మహా కల్తీ కూటమి మాత్రం సైన్యం శక్తిని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. తాను అధికారంలోకి వస్తే రాజ్యాంగబద్ధ సంస్థల్ని నిర్వీర్యం చేస్తానని, రిజర్వేషన్లను రూపుమాపుతానని ప్రతిపక్షాలు లేనిపోని భయాందోళనలు సృష్టిస్తున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు ఎన్డీయే వైపే చూస్తున్నారని అంతకుముందు ట్విటర్లో ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే బిహార్తో పాటు అసోంలోనూ జరగనున్న ప్రచార సభల్లో మోదీ పాల్గొననున్నారు. తొలి విడత ఎన్నికల ప్రారంభం సందర్భంగా భారీ సంఖ్యలో ప్రజలు పోలింగ్లో పాల్గొనాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

## ఏపీ పోలింగ్లో హింసాత్మక ఘటనలు

పార్టీల ఏజెంట్లు గొడవకు దిగారు. ఈ క్రమంలో సభాపతి చొక్కాను వైకాపా కార్యకర్తలు చించివేశారు. ఈ క్రమంలో కోడెల సొమ్మసిల్లారు. ఆయన కారు అద్దాలనూ పగలగొట్టారు.

నా పరిస్థితే ఇలా ఉంటే.. సామాన్యుడి పరిస్థితేంటి?

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లిన తనపై వైకాపా కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని సభాపతి కోడెల శివప్రసాదరావు అన్నారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని ఇనమెట్లలో రిగ్గింగ్కు పాల్పడుతున్నారని తెలిస్తే అక్కడికి వెళ్లినట్టు చెప్పారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లగానే తనపై దాడికి పాల్పడ్డారని, పోలింగ్ అధికారులు తలుపులు వేస్తే వాటినీ పగులగొట్టారని చెప్పారు. వైకాపా నాయకులు దౌర్జన్యాలు చేస్తారని ముందే ఊహించానన్నారు. ఈ విధంగా దాడులు చేయడం ఇన్నేళ్లలో మొదటిసారి చూస్తున్నట్టు చెప్పారు. సభాపతిగా ఉన్న తనకే ఇలా జరిగితే ఇక సామాన్యుడి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఈవీఎంలు వద్దని సీఎం చంద్రబాబు ముందునుంచే చెబుతున్నారని ఈ సందర్భంగా కోడెల గుర్తు చేశారు.

అనంతలో ఒకరి మృతి..

అనంతపురంలో పోలింగ్ హింసాత్మకంగా మారింది. తాడిపత్రి మండలం మీరాపురంలో తెదేపా, వైకాపా వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. వైకాపా నాయకుల దాడిలో తెదేపా నేత చింతా భాస్కర్రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. భాస్కర్రెడ్డిని అనంతపురం ఆస్పత్రికి తరలించిన అనంతరం మృతిచెందారు. ఇదే జిల్లాలో రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు మండలం సిద్ధ రామాపురంలో పోలింగ్ కేంద్రంలోనే తెదేపా, వైకాపా కార్యకర్తలు కొట్టుకున్నారు. ఈ ఘటనలో పది మందికి గాయాలయ్యాయి. అదే మండలం అనప గ్రామంలో తెదేపా, వైకాపా కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు తెదేపా కార్యకర్తలు గాయపడ్డారు.

అఖిలప్రియ సోదరి కారు ధ్వంసం

కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం అహోబిలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా అఖిలప్రియ సోదరి భూమా నాగమౌనిక కారు అద్దాలను వైకాపా వర్గీయులు ధ్వంసం చేశారు. దీంతో నాగమౌనిక పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగుల వర్గీయులు వాహనాల్లో రాళ్లు, కర్రలతో తిరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఆరోపించారు.

ఇదే నియోజకవర్గం అహోబిలంలో తెలుగుదేశం, వైకాపా వర్గాల మధ్య బాహాబాహి జరిగింది. ఇరువర్గాలు కర్రలతో కొట్టుకుంటూ.. రాళ్లు రువ్వకున్నారు. ఈ ఘటనలో ఎస్ఐ సుధాకర్రెడ్డి తోపాటు, స్వతంత్ర్య అభ్యర్థి కుందూరు రామిరెడ్డి, మరో ఆరుగురు గాయపడ్డారు.

ప్రకాశం జిల్లా చీరాలలో వైకాపా నాయకుడు, మున్సిపల్ ఛైర్మన్ మోదడుగు రమేష్ బాబు 103 పోలింగ్ బూత్లో హల్చల్ చేశారు. ఓటు వేసేందుకు లోపలికి వచ్చిన ఆయనను గుర్తింపు కార్డు ఏదని ఏజెంట్ అడగడంతో.. ఆయన బూతు పురాణం అందుకున్నారు. బూతులు తిడుతూ వీరంగం సృష్టించారు. దీంతో అక్కడకు చేరుకున్న తెదేపా ఏజెంట్లు మంచి పద్ధతి కాదని వాగ్వాదానికి దిగారు. పోలీసులు సర్ది చెప్పి పంపించేశారు.

చిత్తూరు జిల్లా చంద్రగిరిలో వైకాపా అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రతాపం చూపబోయారు. రామచంద్రాపురం మండలం రాయుల్లవారిపల్లెలో తమకు అనుకూలంగా ఓట్లు వేయడంలేదని గ్రామస్థులపై దుర్భాషలాడారు. దీంతో గ్రామస్థులు చెవిరెడ్డిపై తిరగబడ్డారు. వెంటనే అక్కడి నుంచి చెవిరెడ్డి తిరిగి వెళ్లిపోయారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సైనికుల కష్టపడుతున్న : శరగడం పత్నిరావు



ములగాడ: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గురువారం పారిశ్రామిక ప్రాంతంలో వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శరగడం పత్నిరావు పార్టీకి ప్రచారానికి సైనికుడిలా ప్రజల ఆదరాభిమానాలు పొందుతూ పార్టీని ముందుకు నడిపిస్తూ తనదైన రీతిలో పార్టీ బలోపేతానికి రాత్రి పగలనకా కష్టపడుతూ పారిశ్రామిక స్థానిక ప్రజలు ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం జరగాలంటే రానున్న ఎన్నికల్లో వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం లోకి రావాలని ఉద్దేశ్యంతో గురువారం జరుగుతున్న ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించే విధంగా వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు తన చేతుల మీదగా పోలింగ్ కేంద్రాలకు తీసుకుని వెళ్లి ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చేయడంతో స్థానిక ప్రజలు ఆవేదనతో ఇంత మంది పార్టీ నాయకులు ఉన్న ఎవరు మమ్మల్ని గుర్తించకపోయినా మా కుటుంబంలో ఒక సభ్యునిగా గుర్తించి ఈ రోజు మీ ఓటు హక్కు వినియోగించుకోవడం చాలా సంతోషం వ్యక్తం చేశారు.

స్థానిక ప్రజలందరూ పత్నిరావు కృతజ్ఞతలు తెలిపారు.

# విజయభాను సంపాదకీయం

## తీరని రైతు సమస్య

దేశంలోని మధ్య, పశ్చిమ రాష్ట్రాలలో సాగుతున్న రైతుల ఆందోళన కొనసాగుచున్నది. ఆందోళన ప్రశాంతంగా సాగుతున్నప్పటికీ, రైతుల్లో ఆగ్రహం ఎంత తీవ్రంగా ఉన్నదో ఈ గాంవ్ బంద్ ఆందోళన వల్ల తెలుస్తున్నది. ఏడు దశాబ్దాలుగా జాతీయ పార్టీలు వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యంచేసిన ఫలితమిది. ఈ నెల ఒకటవ తేదీ నుంచి సాగుతున్న ఈ ఆందోళనలో మధ్యప్రదేశ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాల రైతులు పాల్గొన్నారు. మొదట ఐదు రాష్ట్రాలలోనే ఆందోళన సాగించాలని భావించినప్పటికీ, అనూహ్యంగా ఈ ఆందోళన ఇతర రాష్ట్రాలకు విస్తరించింది. వందకు పైగా రైతు సంఘాలు ఈ ఆందోళనలో పాలుపంచుకుంటున్నాయి. గ్రామ బంద్‌లో భాగంగా గ్రామాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను పంపకూడదని రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. దీంతో మొదటి రెండురోజులు సాధారణంగా గడిచినప్పటికీ, క్రమంగా పట్టణ ప్రాంతాలలో పాలు కూరగాయాల కొరత అధికమవుతున్నది. రైతు సంఘాలు పది రోజుల పాటు బంద్ పాటించాలని పిలుపు ఇచ్చినందు వల్ల వచ్చే రోజులలో రైతుల ఆందోళన ప్రభావం మరింత తీవ్రంగా ఉండవచ్చు. వ్యవసాయరంగంలో సంక్షోభంలో కూరుకుపోయే కొద్దీ రైతుల పరిస్థితి దిగజారి పోతున్నది. పంటకు గిట్టుబాటు ధర ఉండటం లేదు. నీటి పారుదల సౌకర్యం లేని ప్రాంతాలు అనేకం ఉన్నాయి. చిన్న కమతాల రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది. దీంతో రైతు కుటుంబాలలో నిరసన పెల్లుబుకుతూనే ఉన్నది. గతేడాది నిరసనలు తీవ్రతరమయ్యాయి. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో ఇప్పుడు మళ్ళా పెద్ద ఎత్తున నిరసన ప్రారంభమైంది. రైతులు ఇంత పెద్దఎత్తున నిరసన చేపడితే జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌ల వైఖరి అత్యంత బాధ్యతారహితంగా ఉన్నది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధా మోహన్ సింగ్ ఈ ఆందోళనను టీవీలలో ప్రచారం కోసం చేస్తున్న హడావుడిగా కొట్టిపారేశారు. దేశంలో 12 నుంచి 14 కోట్ల మంది రైతులు ఉన్నారు. ఒక సంస్థలో కొన్ని వందల మంది లేదా వేల మంది ఉంటారు. మీడియా దృష్టిలో పడటానికి ఏదో ఒకటి చేయాలి అన్నారాయన. కేంద్రంలోని మరో పెద్ద మనిషి తమకు రైతుల నుంచి విజ్ఞాపన పత్రం అందలేదని, అది అందితే పరిశీలిస్తామని వ్యాఖ్యానించారు. హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఈ నిరసన అసలు సమస్యే కాదని తేల్చివేశారు. వారికి ఏ సమస్యలు లేక అనవసర విషయాలపై సమ్మె చేస్తున్నారని, తమ ఉత్పత్తులు అమ్ముకోకపోతే నష్టపోయేది రైతులేనని అన్నారు. దీన్నిబట్టి నాయకులలో రైతుల పట్ల ఉన్న నిర్లక్ష్యం తెలుస్తున్నది. రైతులలో ఆగ్రహం తీవ్రస్థాయికి చేరుకుంటున్న సూచనలు ఏడాది కాలంగా కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఏడాది కిందట మధ్యప్రదేశ్‌లో రైతుల ఆందోళన పెద్దఎత్తున సాగింది. ఈ ఆందోళనలో గతేడాది జూన్ 8వ తేదీన పోలీసు కాల్పులలో ఆరుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన జరిగి ఏడాదైన సందర్భంగా మళ్ళా నిరసన చేపట్టాలనే ప్రతిపాదన క్రమంగా పలు రాష్ట్రాలలో విస్తృత ఆందోళనకు దారితీసింది. ఈ సందర్భంగా భారత్ బంద్ చేపట్టాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఈ నెల ఆరవ తేదీ నుంచి పదవ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు మహారాష్ట్రలో కూడా రైతుల ఉద్యమం ఊపందుకున్నది. గతేడాదిలో జాట్‌లు, పటీదారులు, మరాఠాలు ఇట్లా దేశంలోని పశ్చిమ, మధ్య రాష్ట్రాలలోని రైతు వర్గాలు ఆందోళనలు సాగిస్తూనే ఉన్నాయి. అయిన కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రైతుల సమస్యల పట్ల పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నది. ఇప్పుడు ఆందోళన సాగుతున్న రాష్ట్రాలలో పంజాబ్ మినహా మిగతావన్నీ బీజేపీ పాలిస్తున్నవే. పంజాబ్‌లోని రైతులు కూడా కాంగ్రెస్ పాలన పట్ల ఆశలు కోల్పోయి ఉన్నారు. అయినా ఈ ఆందోళన ద్వారా రాజకీయ లబ్ధి పొందడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నది. మధ్య ప్రదేశ్‌లో రైతులు కాల్పుల్లో మరణించి ఏడాదైన సందర్భంగా కార్యక్రమాలు చేపడుతున్నది. వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోవడంలో బీజేపీతో పాటు కాంగ్రెస్ పార్టీ బాధ్యత కూడా ఉన్నది. ఇంతకాలం దేశాన్ని పాలించింది ఈ రెండు పార్టీలే. కాంగ్రెస్ పార్టీకి రైతుల సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి ఉంటే, కనీసం పంజాబ్ రాష్ట్రాన్ని ఒక ప్రయోగశాలగా మార్చి ఎన్నో వ్యవసాయ అభివృద్ధి పథకాలు చేపట్టవచ్చు. ఇందుకు ఉదాహరణ తెలంగాణ రాష్ట్రమే. కొత్తగా ఏర్పడిన రాష్ట్రం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి సమగ్ర వ్యూహాన్ని అమలు చేస్తున్నారు.

# ర్యాలీలో ఖుష్బూకు చేదు అనుభవం

బెంగళూరు: సినీ నటి, ఏఐసీసీ అధికార ప్రతినిధి ఖుష్బూకు చేదు అనుభవం ఎదురైంది. బుధవారం బెంగళూరులో నిర్వహించిన ఓ ర్యాలీలో కాంగ్రెస్-జేడీఎస్ కూటమి నేత రిజ్వాన్ అర్షద్‌కు మద్దతు తెలిపేందుకు ఖుష్బూ వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆమె తన వాహనం వైపు నడుస్తుండగా ఓ వ్యక్తి వెనక నుంచి ఖుష్బూ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దాంతో కోపోద్రిక్తురాలైన ఆమె సదరు వ్యక్తి చెంప చెళ్లుమనిపించారు. అది గమనించిన పోలీసులు, పార్టీ కార్యకర్తలు ఆ వ్యక్తిని పక్కకు లాగేశారు. ఆ సమయంలో స్థానిక మీడియా వర్గాలు వీడియో తీయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. ఈ విషయం గురించి రిజ్వాన్ మీడియాతో మాట్లాడుతూ.. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.



# ప్రచారానికే మోదీ ప్రాధాన్యతనిస్తున్నారు : మమత




డార్జిలింగ్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. తనను తాను ప్రచారం చేసుకోవడానికే ఆయన ప్రాధాన్యతనిస్తున్నారని ఆమె ఆరోపించారు. పుల్వామా ఉగ్రదాడిపై ఆయన రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో డార్జిలింగ్‌లోని చౌక్‌బజార్‌లో నిర్వహించిన ప్రచార సభలో పాల్గొన్న ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ... మోదీ చాలా గొప్ప నేత అయిపోయారు.. ఎంతగా అంటే ఆయన జీవిత చరిత్రపై సినిమాలు తీసుకుంటున్నారు. నమో పేరిట దుకాణాలు ఏర్పాటు చేసి నమో దుస్తులను విక్రయిస్తున్నారు. తనను తాను ప్రచారం చేసుకోవడానికి మోదీ అన్ని ప్రయత్నాలు జరుపుతున్నారు. భారత్‌లో స్వాతంత్ర్యం, రాజ్యాంగం ప్రమాదంలో ఉన్నాయి. భాజపా పాలనలో గాంధీజీ, నేతాజీ, వివేకానందలాంటి వారి ఆదర్శాలను కూడా ప్రజలు మర్చిపోయేలా ఉన్నారు అని ఆమె వ్యాఖ్యానించారు.

ఎన్నికల నేపథ్యంలో డార్జిలింగ్‌లో భాజపా కలకలం రేపడానికి ప్రయత్నిస్తోంది. ఇక్కడ వారు సమస్యలు సృష్టిస్తున్నారు. అందుకు ఇక్కడి పరిస్థితులను అవకాశాలుగా తీసుకోవాలనుకుంటున్నారు. కుర్సియాంగ్, కాలింపోంగ్, మిరిక్, డార్జిలింగ్ ప్రాంతాలు అభివృద్ధి చెందాలని భాజపా కోరుకోవట్లేదు. డార్జిలింగ్ ఎంపీ, భాజపా నేత ఎస్ఎస్ అహ్లూవాలియా గత ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఈ ప్రాంతంలో ఎన్నడూ పర్యటించలేదు అని మమతా బెనర్జీ విమర్శించారు.

డార్జిలింగ్ లోక్‌సభ స్థానంలో 2009, 2014 ఎన్నికల్లో భాజపాయే విజయం సాధించింది. టీఎంసీ ఒక్కసారి కూడా విజయం సాధించలేదు.

# ఓటు వేసిన ఒవైసీ

హైదరాబాద్: ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ గురువారంనాడు తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. నగరంలోని ఓ పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు వేశారు. హైదరాబాద్ లోక్‌సభ స్థానానికి ఎఐఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఒవైసీ, 2004 నుంచి ఇదే నియోజవర్గానికి ప్రాతనిధ్యం వహిస్తున్నారు. ఓటు వేసిన అనంతరం ఎంతో ఉత్సాహంగా కనిపించిన ఒవైసీ మీడియాతో మాట్లాడుతూ, పౌరులంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. మోదీ రెండోసారి ప్రధాని కావాలన్న పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ కలలు సాకారం కాకుండా చూడాల్సిన బాధ్యత ఓటర్లదేనని అన్నారు.



# నామినేషన్ వేసిన స్మృతి ఇరానీ



లక్నో: కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అమేథీ పార్లమెంటరీ నియోజవర్గానికి గురువారం మధ్యాహ్నం 2.45 గంటల ప్రాంతంలో నామినేషన్ వేశారు. అమేథీ నుంచి బీజేపీ అభ్యర్థిగా స్మృతి పోటీ చేస్తుండటం ఇది రెండోసారి. నామినేషన్ సందర్భంగా ఆమె వెంట ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉన్నారు. అంతకుముందు, స్మృతి ఇరానీ, యోగి ఆదిత్యనాథ్ కలిసి భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి స్మృతి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. స్మృతి ఇరానీ రోడ్‌షోలో పాల్గొనడానికి ముందు తన నివాసంలో భర్త జుబిన్ ఇరానీతో కలిసి ప్రత్యేక పూజలు చేసారు. కాంగ్రెస్‌కు కంచుకోటైన అమేథిలో 2014లో ఆమె రాహుల్ గాంధీతో నేరుగా తలబడ్డారు. ఆ ఎన్నికల్లో రాహుల్ చేతిలో సుమారు లక్ష ఓట్ల తేడాతో ఆమె ఓడిపోయారు. అయితే దానికి ముందు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీకి వచ్చిన ఓట్ల శాతాన్ని ఆమె గణనీయంగా తగ్గించగలిగారు. రాహుల్ ఈసారి తన సంప్రదాయ అమేథితో పాటు కేరళలోని వయనాడ్ నుంచి కూడా పోటీ చేస్తుండటంతో అమేథీలో తన గెలుపు ఖాయమని స్మృతి ఇరానీ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అమేథీలో ఓటమి భయంతోనే రాహుల్ వయనాడ్ పారిపోతున్నారని, గెలిచిన రాహుల్ అమేథీ వదిలి వెళ్తుంటే, తాను ఒకసారి ఓడిపోయి కూడా అమేథీ ప్రజల వెన్నంటే ఉన్నానని స్మృతి ప్రచారం సాగిస్తున్నారు.

# సమయం

## 'విద్యే స్వావలంబనకు మూలం'

విద్య అనేది మనిషి వికాసానికి చాలా అవసరం. మనిషి వ్యక్తిత్వానికి విద్యే ఆయువుపట్టు. విద్య వలన మనిషికి కీర్తి ప్రతిష్ఠలు, ధనము ఇతర గౌరవములు లభిస్తాయి. విద్యావంతుడు సర్వ కార్యాలనూ సఫలీకృతం చేసుకోగలడు. విద్వాంసులను, పండితులను అధికారులూ, నాయకులూ గౌరవిస్తారు. అనేక ప్రజా సమస్యలకు వారి సలహాలు, సూచనలను తీసుకుంటారు. పూర్వం రాజులు పండితులను ఘనంగా సన్మానించేవారు. విద్య ఎవరూ దోచుకోలేని ధనము. మనకు వచ్చిన విద్యను ఎంతమందికి పంచినా అది తరగదు. విద్యాభివృద్ధి వల్లనే మానవుడు అనేకమైన వస్తువులను తయారుచేసి తన జీవితాన్ని సుఖమయం చేసుకోగలిగాడు. విద్యకు ఎలాంటి వయో పరిమితి లేదు. తమకు వచ్చిన విద్యను పదిమందికీ పంచుతూ సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తే ఆ విద్య సార్ధకమవుతుంది. విద్యను గురించి ఒక శతక కవి ఏమన్నాడో చూడండి.

'ఇచ్చునదె విద్య, రణమున
జొచ్చునదే మగతనంబు, సుకవీశ్వరులున్
మెచ్చునదె నేర్పు, వాదుకు
వచ్చునదే కీడుసుమ్మ! వసుధమ సుమతీ'

కవితా రచన:
వడ్లమాని అన్నపూర్ణ

# పంచాంగం

| మాసం : చైత్ర , తిథి : సప్తమి ఉ.10.42; ఆర్ద్ర ఉ.7.37; రా.వ.6.59ల 8.30. | శుక్రవారం 12-04-2019 |
|---|---|

**మేషం** : భార్య, భర్తల ఆలోచనలు, అభిప్రాయబేధాలు భిన్నంగా ఉంటాయి. ఫ్యాన్సీ, కిరాణా, సుగంధ ద్రవ్య వ్యాపారస్తులకు కలిసి వచ్చేకాలం. గృహానికి సంబంధించిన వస్తువులు కొనుగోలు చేస్తారు. విదేశాలు వెళ్లటానికి చేయు యత్నాలు ఫలిస్తాయి. మార్కెట్ రంగాల వారికి నిరుద్యోగులకు సదవకాశాలు లభిస్తాయి. **వృషభం** : రుణ యత్నాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. ఆర్థికంగా మంచి అభివృద్ధిని పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలకు, చిరు వ్యాపారులకు అన్ని విధాల కలిసి రాగలదు. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనిభారం పెరుగుతుంది. మీ సంతానం పై చదువుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. **మిధునం** : స్త్రీలతో సంభాషించేటప్పుడు సంయమనం పాటించండి. ఆడిటర్లు అసాధ్యమనుకున్న కేసులు సునాయాసంగా పరిష్కరిస్తారు. ఆత్మీయులకు విలువైన కానుకలు చదివించుకుంటారు. ఎప్పటి నుండో ఆగివున్న పనులు పునః ప్రారంభిస్తారు. వాహనం నడుపునపుడు మెళకువ అవసరం. **కర్కాటకం** : ఉద్యోగ వ్యాపారాల్లో పురోభివృద్ధి సాధిస్తారు. విధినిర్వణలో దొర్లిన తప్పిదాల వల్ల పత్రికా సంస్థలలో వారికి మనస్థిమితం అంతగా ఉండదు. ఫైనాన్సు, చిట్‌ఫండ్ వ్యాపారస్తులకు సంతృప్తి కానరాగలదు. ప్రయాణాలు అనుకూలిస్తాయి. దైవ, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆలయాలు సందర్శిస్తారు. **సింహం** : గృహావసరాలకు నిధులు సమకూర్చుకుంటారు. ప్రభుత్వ సంస్థల్లో వారు కొంత జాప్యం, ఒత్తిడి ఎదుర్కొనక తప్పదు. వస్త్రములు, విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. స్త్రీలు అనవసరం విషయాల్లో జోక్యం చేసుకోవడం వల్ల భంగపాటుకు గురవుతారు. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో పునరాలోచన అవసరం. **కన్య** : ఉపాధ్యాయులక యాజమాన్యం ధోరణి నిరుత్సాహపరుస్తుంది. రవాణ, ఎదుమతులు, ట్రావెలింగ్ రంగాల వారికి ఆశాజనకం. కిరాణ, ఫ్యాన్సీ, సుగంధ ద్రవ్య వ్యాపారులకు కలిసివచ్చే కాలం. ప్రేమికుల మధ్య అనురాగ వాత్సల్యాలు పెంపొందుతాయి. వైద్యులకు పురోభివృద్ధి. ప్రముఖులను కలుసుకుంటారు. **తుల** : కొబ్బరి, పండ్లు, పూలు, హోటల్, తినుబండారాల వ్యాపారులకు పురోభివృద్ధి. కీలకమైన వ్యవహారాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవటం మంచిది. స్త్రీలు ధనవ్యయం విషయంలో జాగ్రత్త వహించ వలసి ఉంటుంది. కొంత మంది మీతో స్నేహం నటిస్తూనే మిమ్ములను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తుంది. **వృశ్చికం** : ఆర్థిక వ్యవహారాలు, నూతన పెట్టుబడులకు సంబంధించి స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. సంఘంలో ఆదర్శజీవనం గడుపుతారు. చేపట్టిన పనులు సకాలంలో సంతృప్తిగా పూర్తి చేస్తారు. విద్యార్థులకు మిత్ర బృందాల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది మెళకువ వహించండి. మిత్రులను కలుసుకుంటారు. **ధనుస్సు** : నూతన పథకాలు, ప్రణాళికలు చేపడతారు. వస్త్ర, బంగారం, వెండి వ్యాపారస్తులకు పురోభివృద్ధి. స్త్రీలు టివి. ఛానెల్స్ కార్యక్రమాలలో రాణిస్తారు. నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినపుడు ఆచి, తూచి వ్యవహరించండి. మీ అభిప్రాయాలను ఇతరులపై బలవంతంగా రుద్దటం మంచిది కాదని గమనించండి. **మకరం** : ప్రముఖులతో పరిచయాలు మీ ఉన్నతికి నాంది పలుకుతాయి. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు. వాదోపవాదాలకు, హామీలకు దూరంగా ఉండటం మంచిది. కొత్త రుణాల కోసం అన్వేషిస్తారు. ముఖ్యుల కోసం షాపింగ్ చేస్తారు. ఆలయాను సందర్శిస్తారు. **కుంభం** : బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. ప్రతి విషయాన్ని సునిశిత దృష్టితో పరిశీలించాల్సి ఉంటుంది. ఇతరులు మీ నుంచి సమాచారం రాబట్టేందుకు ప్రయకత్నిస్తారు. వ్యాపారాలు, ఉపాధి పథకాల్లో నిలదొక్కుకోవటానికి బాగా శ్రమించవలసి ఉంటుంది. **మీనం** : రవాణా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. వాహనం కొనుగోలుకై చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. అతిధ మర్యాదలు బాగుగా నిర్వహిస్తారు. విదేశాల నుండి ఆహ్వానాలు లభిస్తాయి. భూమి కొనుగోలుకై చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్య, వైజ్ఞానిక రంగాలలో వారికి శుభం చేకూరుతుంది.

# ర్యాలి క్షేత్రానికి అందుకే ఆ పేరు వచ్చిందట!



శ్రీమహావిష్ణువు లోక కల్యాణం కోసం ధరించిన రూపాలలో జగన్మోహిని రూపం ఒకటి. దేవతల నుంచి అమృతాన్ని దక్కించుకోవడానికి అసురులు ప్రయత్నిస్తూ వుండగా, వాళ్లకి అమృత భాండం చిక్కకుండా చేయడం కోసం స్వామి జగన్మోహిని రూపాన్ని ధరించాడు. అలా స్వామి తాను అనుకున్న కార్యాన్ని పూర్తిచేసిన తరువాత, పరమశివుడి కంటపడతాడు. జగన్మోహిని సౌందర్య విశేషం సదాశివుడిని ఆశ్చర్యచకితుడిని చేస్తుంది. విష్ణు మాయ కారణంగా ఆకర్షితుడైన శివుడు .. జగన్మోహినిని అనుసరి స్తాడు. ఆయన వెంబడిస్తుండటం గమనించిన జగన్మోహిని తన నడక వేగాన్ని పెంచుతుంది. అలా హడావిడిగా ఆమె వెళుతూ వుండగా ఆమె తలలో తురుముకున్న పుష్పం ఒకటి 'రాలి' పడిపోతుంది. లోక కల్యాణం కోసం వచ్చిన జగన్మోహిని తలలోని పుష్పం 'రాలి' పడిన ప్రదేశం కనుక, ఈ ప్రదేశానికి 'ర్యాలి' అనే పేరు వచ్చిందననేది ఒక కథగా చెబుతారు. ఒకే మూలమూర్తికి ముందు భాగంలో కేశవస్వామి దర్శనమిస్తూ ఉండగా, వెనుక భాగంలో జగన్మోహిని రూపం కనిపిస్తుంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఆత్రేయపురం మండలం పరిధిలో ఈ క్షేత్రం అలరారుతోంది. అత్యంత ప్రాచీనమైన ఈ క్షేత్రాన్ని దర్శించడం వలన, విశేషమైన ఫలితాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

# చెన్నకేశవస్వామి మహిమ!



శ్రీమహావిష్ణువు .. శ్రీచెన్నకేశవస్వామిగా ఆవిర్భవించిన క్షేత్రాలలో ఒకటిగా 'ఉల్లిపాలెం' కనిపిస్తుంది. కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని మహిమాన్వితమైన క్షేత్రాలలో ఇది ఒకటిగా వెలుగొందుతోంది. 'నగరం' మండలంలోని ఈ క్షేత్రంలో శ్రీ భూ నీలాదేవి సమేత చెన్నకేశవస్వామి పూజాభిషేకాలు అందుకుంటూ వస్తున్నాడు. ఇక్కడ స్వామి కొలువుదీరడం వెనుకనే ఆయన మహిమ ఎంతటిదో తెలుస్తుంది. పూర్వం ఇక్కడి గ్రామంలోని జమీందారుకి కలలో స్వామివారు కనిపించి తన జాడ తెలియజేసి, తనని ఈ గ్రామంలో ప్రతిష్ఠించి పూజించమని చెప్పాడట. అయితే ఇది సాధారణమైన కలే అనుకుని ఆయన తన దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమై వున్నాడు. దాంతో మరుసటి రోజు రాత్రి ఆయనకి స్వామి మళ్లీ స్వప్నంలో కనిపించడమే కాకుండా, తాను చెప్పిన విషయాన్ని మరోమారు గుర్తుచేశాడట. అంతేకాకుండా వెంటనే తన మూర్తిని ఆ గ్రామానికి తరలించమంటూ తట్టి లేపాడట. అప్పుడు ఆయన ఆ పనికి పూనుకుని 'అల్లపర్రు'లోని స్వామివారి ప్రతిమను 'ఉల్లిపాలెం' చేర్చారట. అలా స్వామి తమ గ్రామానికి కోరి వచ్చాడు కనుక, ఇక్కడి ప్రజలంతా స్వామిని తమ ఇష్టదైవంగా భావిస్తుంటారు. అనునిత్యం ఆ స్వామిని కొలుస్తూ తరిస్తుంటారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

ప్లాట్లు అమ్మకంనకు గలవు
సబ్బవరం మండలంలో ఆరిపాక మెయిన్‌రోడ్డులో 22 సెంట్లు, 190 చ॥గ॥, 173 చ॥గ॥ ఇల్లు వుడా ప్లాట్లు మరియు పంచాయితీ ప్లాట్లు అమ్మకంనకు కలవు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 9866955823; 8247641310

# నేటి నుంచి ఆదిత్యుని వార్షిక కల్యాణాలు

అరసవల్లి : అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 12 నుంచి వార్షిక కల్యాణాలు నిర్వహించనున్నారు. చైత్రశుద్ధ సప్తమి నుంచి 19వ తేదీ వరకు చైత్రబహుళ పాడ్యమి వరకు ఈ కల్యాణాలు జరపనున్నారు. 12వ తేదీన ధ్వజారోహణం, 14న సుగంధద్రవ్య మర్దన, 15న ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం, 16న ఆగ్నేయ స్థాలీపాక హెూమాదులు, 17న వేదసదస్సు, 18న తిరుమంగయాళ్వారుల చరిత్ర, 19న ధ్వజావరోహణం, పుష్పయాగ మహెూత్సవం జరుగుతాయని ఈవో పుష్పనాథం, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు.

# కణపాకలో కలక్టర్ ఓటింగ్



విజయనగరం: ఓటువేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఎం.హరి జవహర్ లాల్ సూచించారు. గురువారం మదా హ్నం 3 గంటలకు పట్టణంలోని కణపాక యూత్ హాస్టల్‌లో 28వ పోలింగ్ కేంద్రం వద్ద సాధారణ ఓటర్‌లా క్యూలో నిల్చుని తాను వారి సతీమణి ఎం.శైలజా భాయ్ ఓటుహక్కు వినియోగించుకున్నారు. టార్గెల్ 90 లక్ష్యంగా పని చేశామన్నారు.

# ఏపీఈపిడిసిఎల్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



విశాఖపట్నం : మహాత్మ జ్యోతిరావు పూలే 193వ జయంతి వేడుకలను ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్‌బొడ్డు శేషుకుమార్ ఆధ్వర్యంలో సంస్థ కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీ బొడ్డు శేషుకుమార్ పూలమాల వేసి ఘణంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో అవమానాలకు కృంగిపోకుండా ధీటుగా ఎదుర్కొని అణగారిన కులాల అభ్యున్నతికి, స్త్రీ జనోద్ధరణకు విశేష సేవలు చేసి సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలేను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు.రాష్ట్ర బి.సి. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీ పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే మొట్టమొదటి మహాత్మ బిరుదాంకితుడన్నారు.

సత్యశోధక సమాజ్ ని స్థాపించి సాంఘిక అసమానతలను తొలగించేందుకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్తన్నారు. పూలే రాసిన గులాంగిరి (బానిసత్వం) పుస్తకం నేటితరానికి ఆనాటి పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ఎంతగానో తోడ్పడిందన్నారు. అటువంటి మహనీయుని జయంతి వేడుకలు జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సిజిఎం (హెచ్.ఆర్.డి.) పి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ బి.రమేష్ ప్రసాద్, సి.జి.ఎం. కె.ఎస్.ఎస్.మూర్తి, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటు కోసం వస్తూ... రైలు ప్రమాదంలో మృతి

## రత్తకన్నకు చెందిన వలస కార్మికుడి మృతితో విషాదం



ఇచ్ఛాపురం : ఓటు వేసి తన బాధ్యతను నిర్వ ర్తించుకుందామని, అయినవారితో కలసి ఓట్ల పండగలో పాల్గొనేందుకు ఇచ్ఛాపురం వస్తున్న రత్తకన్న గ్రామానికి చెందిన వలస కార్మికుడు మార్గమధ్యలోనే ప్రమాదానికి గురై కన్నుమూసిన సంఘటన ఇచ్ఛాపురంలో విషాదం నింపింది. భర్త రాక కోసం ఎదురుచూస్తున్న భార్య పద్మకు వార్త చేరడంతో ఆమె కన్నీరుమున్నీరైంది. వివరాల్లోకి వెళ్తే... ఇచ్ఛాపురం పురపాలక సంఘ పరిధి రత్తకన్న గ్రామానికి చెందిన గిన్ని బుచ్చి(27) స్థానికంగా ఉపాధి దొరక్క ఇతం ప్రాంతాలకు కూలికి వెళ్లి వస్తుంటారు. గతంలో విదేశాలకు వెళ్లి వచ్చిన బుచ్చి రెండేళ్లుగా కేరళలో ఉంటూ, అక్కడే భవన నిర్మాణపనుల్లో ఉపాధి పొందుతున్నాడు. గత కొంతకాలంగా ఇంటికి దూరంగా ఉండడం, ఈలోగా సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఓటేసేందుకు సోమవారం రాత్రి కేరళ నుంచి బయలుదేరాడు. మంగళవారం రాత్రి పలాస సమీపానికి వచ్చానని, త్వరగానే ఇంటికి చేరుకుంటానని భార్యకు సమాచారం ఇచ్చాడు. బుధవారం ఉదయానికి ఇంటికి చేరకపోవడంతో బుచ్చి కోసం కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చెందారు. ఈలోగా పలాస రైల్వే పోలీసుల నుంచి ఇంటికి సమాచారం చేరింది. రైలు నుంచి జారిపడిన బుచ్చి మృతి చెందాడని తెలియడంతో బంధువులంతా పలాస పయనమయ్యారు. పలాస దాటిన తరువాత రైలు ద్వారం వద్దకు వచ్చిన బుచ్చి, ప్రమాదవశాత్తూ పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. బుచ్చి భార్య పద్మ ఆశావర్కర్‌గా పని చేస్తోంది. వీరికి విష్ణు, తేజ ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరూ రెండేళ్లలోపు వారే. ఆ చిన్నారులను చూసి గ్రామస్థులు కంటతడి పెట్టారు.

# మధురావాడలో ప్రశాంతంగా ఎన్నికలు



మధురవాడ : మహా విశాఖ మధురవాడ పరిసర ప్రాంతాల్లో పోలింగ్ చెడుమొదురు సంఘటనల మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగింది గురువారం ఉదయం 6 గంటలనుంచి బారులుతీరిన ఓటర్లు కానీ ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది పోలింగ్ బూతుల వద్ద కనీస సదుపాయాలు ఏర్పాటు చేయనందున ఓటర్లు ఇబ్బందిపడ్డారు, ఎండనుంచి రక్షణకి టెంట్ సదుపాయం కల్పించలేదు, సరిపడినంత త్రాగునీరును ఏర్పాటు చెయ్యలేదు ఎన్నికల పరిశీలకులు బూతుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని ఓటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు,

భీమిలి వైకాపా అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాస్, జనసేన అభ్యర్థి సందీప్ పంచకర్ల, టీడీపీ అభ్యర్థి సబ్బం హరి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు, పోలింగ్ బూతుల వద్ద సౌకర్యాలు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

# పెద్దాపురం నియోజకవర్గంలో పటిష్టమైన ఏర్పాట్లతో పోలింగ్





పెద్దాపురం : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం పెద్దాపురం నియోజకవర్గంలో పటిష్టమైన ఏర్పాట్లతో ప్రశాంత వాతావరణంలో ప్రారంభం కాగా పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7 గంటలకే ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ యంత్రాలలో స్వల్ప అంతరాయాలు రాగా వెంటనే అధికారులు స్పందించి వాటిని సరిచేయడం జరిగింది. పోలింగ్ కేంద్రాల ఆవరణలో షామియనాలు,త్రాగునీటి సౌకర్యాలు కల్పించడం జరిగింది. వృద్ధ,మధ్య వయస్సు, యువతర ఓటర్లతో పోలింగ్ కేంద్రాల వద్ద ఉత్సాహ భరితమైన, పండుగ వాతావరణం నెలకొంది. పెద్దాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎస్.ఎస్.వి.బి వసంత రాయుడు కుటుంబ సమేతంగా పెద్దాపురం లూథరస్ హైస్కూల్ లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నియోజకవర్గంలో ఉదయం 9 గంటలకు 12 శాతం ఓటింగ్ నమోదుకాగా, 11 గంటలకు 26 శాతం,మధ్యాహ్నం 1 గంటకు 44.22 శాతం,3 గంటలకు 59.79% శాతం,సాయంత్రం 5 గంటలకు 65% శాతం పోలింగ్‌నమోదైంది.ఇంకా పోలింగ్ ప్రక్రియ ఇంకా కొనసాగుతుంది.

# నృత్యంతో నటరాజుకు నీరాజనం



విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామ నారాయణంలో శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బెంగుళూరుకు చెందిన దిక్సూచి నాట్యాలయ వ్యవస్థాపకులు దివ్య శివనారాయణ్ నృత్య దర్శకత్వంలో వారి శిష్యబృందం నృత్యంతో నటరాజకుకు నీరాజనం గావించారు. హంసనాద పుష్పాంజలి, అయిగిరి నందిని, జతిస్వరం, ఫ్యూజన్ అలారిపు, ముద్దుగారే యశోద తదితర గీతాలను హరిప్రియ, వర్షిణి, జాహ్నవి, సుస్మిత శ్రీ, పూజశ్రీ, పూర్విత‌లు తమ నృత్యంతో భక్తులను అలరించారు. అనంతరం ఎన్ సిఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు నృత్యబృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ టిఎల్‌ఎన్ మూర్తి, పాలనాధికారి ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరాజు, ఎం వి రమణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ



కాకినాడ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం జిల్లాలో పటిష్టమైన ఏర్పాట్ల తో ప్రశాంత వాతావరణంలో ప్రారంభం కాగా, ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలలో ఉదయం 7 గంటల నుండే క్యూ లైన్లలో బారులు తీరారు. వికలాంగులు, వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక రవాణా సదుపాయం, వీల్ చైర్ల్ లను ఎన్నికల యంత్రాంగం ఏర్పాటు చేసింది. అలాగే ఉదయం నుండే ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఓటర్ల సౌకర్యం కొరకు పోలింగ్ కేంద్రాల ఆవరణలో షామియానాలు, త్రాగునీటి సదుపాయాలను కల్పించారు. ఈ విడత పోలింగ్ లో క్రొత్తగా వివిపాట్ యంత్రాలను వినియోగిస్తున్న నేపద్యంలో అక్కడక్కడా కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ యంత్రాలకు స్వల్ప అంతరాయలు ఎదురుకాగా, సెక్టోర్, రూట్ అధికారులు తక్షణం స్పందించి ప్రత్యామ్నాయ యంత్రాలను ఏర్పాటు చేసి పోలింగ్ కొనసాగేలా చర్యలు చేపట్టారు. ఉదయం 9 గం.లకు 12.36 శాతం ఓటింగ్ పూర్తి కాగా 11 గం.లకు 27.5 శాతం నమోదైయ్యింది. యువతరం ఓటర్లతో పాటు, మద్య వయస్సు, వృద్ధ ఓటర్లు కూడా తమ ఓటు నమోదు చేసేందుకు తరలి రావడంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఉత్సాహభరితమైన పండుగ వాతావరణం నెలకొంది.

జిల్లా కలెక్టర్ కార్తి కేయ మిశ్రా దంపతులు ఉదయం 9-30 గం.లకు స్థానిక శ్రీనగర్ లోని నగర పాలక బాలికోన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్ లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కలెక్టర్ దంపతులు ఓటర్లతో పాటు క్యూ లైన్లలో తమ వంతు వచ్చే వరకూ నిలబడి ఓటు వేశారు. అదే బూత్ లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహంతో వచ్చిన యువ ఓటర్లు వారితో కలిసి సెల్ఫీలు దిగారు. ఈ సందర్బంగా తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లను జిల్లా కలెక్టర్, ఆయన సతీమణి అభినందించారు. అలాగే ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన వయోవృద్ధులను జిల్లా కలెక్టర్ గౌరవపూర్వకంగా నమస్కరించి, వారి ప్రజాస్వామ్య స్పూర్తి యువతరానికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. అదే సమయానికి అదే బూత్ లో తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన గురువు చాగంటి కోటేశ్వరరావు, ఆయన సతీమణి హాజరై కలెక్టర్ దంపతులతో పాటు ఓటింగ్ లో పాల్గొన్నారు. ఈ సందర్బంగా తనను కలిసిన మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అంతటా ఎన్నికల పోలింగ్ సజావుగా ప్రారంభ మైందని, అక్కడక్కడ ఈవియం లకు ఎదురైన చిన్నచిన్న సమస్యలు మినహా పోలింగ్ చురుకుగా సాగుతోందని తెలిపారు. జిల్లాలో లోని అన్ని పోలింగ్ కేంద్రాలను వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్లకు అనుసంధానం చేసి పర్యవేక్షిస్తూ, సమస్యలను తక్షణం చక్కదిద్దుతున్నామని తెలియజేశారు.

అలాగే జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విశాల్ గున్ని కాకినాడ నగరం, రూరల్ పరిధిలోని దుమ్ముల పేట, ఏటి మొగ, జగన్నాధపురం, ఇంద్రపాలెంలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, బద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. జిల్లా అంతటా పోలింగ్ ప్రశాంతంగా సాగుతోందని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వాట్సాప్, సి విజిల్ యాప్ల ద్వారా సమాచారం అందిస్తే పరిస్థితులను చక్కదిద్దేందుకు పోలీస్ యంత్రాంగం సంసిద్దంగా ఉందని తెలియజేసారు.

# సింహాచలంలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

**- పలుచోట్ల ఈవీఎంలు మొరాయింపు - సౌకర్యాలు లేవని ఓటర్లు గగ్గోలు**



సింహాచలం : 72వ వార్డు సింహాచలంలో ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకున్నా ప్రశాంతంగా ముగిసాయి. అడివివరం పాఠశాల, సంస్కృత పాఠశాల, మెయిన్ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల, జంగాలకోలనీ పాఠశాలలో ఓటర్లు తమఓటును విని యోగించుకోవడాని ఉదయం నుండే బారులు తీరారు. సంస్కృత పాఠశాలలో భూత్ 230 లో ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు ఎండలో ఇబ్బంది పడటంతో సుమారు గంటున్నరా తరువాత అధికారులు ఈవీఎం మార్చడంతో పోలింగ్ నెమ్మదించింది భూత్ 228 లో సిబ్బంది తక్కువుగా ఉండటం అధికారులు నెమ్మదిగా పనిచేయడంతో వృద్దులు మహిళలు ఎండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



అలాగే పాత అడివివరం స్కూల్ ఇతర చోట్ల ఈవీఎం లు మొరాయింపుతో ఓటర్లు తీవ్ర నిరసన వ్యక్తంచేశారు

అంతే కాకున్నా ఓటర్లకు సౌకర్యాలు సరిగ్గా ఏర్పాటుచేయకపోవడంతో మహిళలు వృద్దులు ఎండలో ఇబ్బంది పడ్డారు. అంతేకాకున్నా చాలామంది ఓట్లు గల్లంతు అవడంతో కొందరు ఛాలెంజింగ్ ఓటుకు సిద్ధపడిన అధికారులు నిరాకరించడంతో ఓటర్లు నిరాశ చెందారు.

ఈ సంధర్భంగా ఎలక్షన్ కమిషన్ సరైన ఏర్పాట్లు ఓట్లు గల్లంతు మరియు ఈ వీ ఎం మొరాయింపు సిబ్బంధి కొరత ఛాలంజింగ్ ఓటుకు నిరాకరణ మొద ంలుగు విషయాలలో ఎలక్షన్ కమీషన్ వైఫల్యం చెందిందని దుమ్మెత్తి పోశారు

# ఓటేసిన సినీ, రాజకీయ ప్రముఖులు



హైదరాబాద్ : తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. తెలంగాణ వ్యాప్తంగా సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగియగా.. నిజామాబాద్‌లో 6 గంటల వరకు కొనసాగింది. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం మినహా తెలంగాణలో సాయంత్రం 5గంటలకు పోలింగ్ ముగిసింది. అయితే పోలింగ్ ముగిసే సమయానికి క్యూ లైన్లలో నిలుచున్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. నిజామాబాద్‌లో సాయంత్రం 6 గంటలకు వరకు పోలింగ్ కొనసాగనుంది. తెలంగాణలో మధ్యాహ్నం మూడు గంటల వరకు 48.95 శాతం పోలింగ్ నమోదయింది. నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం..

ఆదిలాబాద్- 57.04%, పెద్దపల్లి- 54.83%, కరీంనగర్- 58.10% నిజామాబాద్- 45.29%, జహీరాబాద్- 63.39%, మెదక్- 62.50%, మల్కాజ్‌గిరి- 36.39% సికింద్రాబాద్- 30.20%, హైదరాబాద్- 27.79%, చెవేళ్ల- 40.45%, మహబూబ్‌నగర్- 56.00%, నాగర్ కర్నూలు- 51.50%, నల్గొండ- 58.21%, భువనగిరి- 57.41%, వరంగల్- 51.50% మహబూబ్‌బాద్- 55.24%, ఖమ్మం- 54.80%




వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్, జీవితలు జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తెలంగాణలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసింది. అయితే 4గంటల వరకు క్యూలైన్లో ఉన్నవారికి అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల వరకు 36.39 శాతం పోలింగ్ నమోదయింది. తెలంగాణలోని లోక్‌సభ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతుంది. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో మధ్యాహ్నం మూడు గంటల వరకు 58.10 శాతం పోలింగ్ నమోదయింది. మహబూబ్‌నగర్‌లో 48 శాతం, నాగర్ కర్నూల్ 51.5 శాతం, ఖమ్మంలో 54.80 శాతం ఓటింగ్ నమోదయింది. జగిత్యాల ఎస్పీ సింధు శర్మ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిద్దిపేట మండలంలోని ఇబ్రహీంపూర్ పోలింగ్ బూత్ ముందు మెదక్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ బైఠాయించి నిరసన తెలిపారు. టీఆర్ఎస్ నేతలు ఉదయం పోలింగ్ బూత్‌లో తమ పార్టీ ఏజెంట్ పై దాడికి పాల్పడటంతో పాటు, రిగ్గింగ్ చేశారని ఆయన ఆరోపించారు.

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరీంనగర్‌లో 45.62 శాతం, ఖమ్మంలో 41.62 మహబూబాబాద్‌లో 47.29, వరంగల్‌లో 40.24 శాతం నమోదయింది.

ఖమ్మంలో తన గెలుపు ఖాయమని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రేణుకా చౌదరి అన్నారు. ఓటు వేసిన తర్వాత ఆమె మీడియాతో ట్లాడుతూ.. విజయంపై ఆశాభావంతో ఉన్నట్టు చెప్పారు. ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం జోగిపేటలోని మార్కెట్ యార్డు పోలింగ్ బూత్‌లో ఆయన తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లా మధిర సెంట్ ఫ్రాన్సెస్ హైస్కూల్‌లో ఓటు వేశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ భాజపా అభ్యర్థి సోయం బాపూరావు బోథ్ మండలం ఘన్పూర్ గ్రామంలో కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో ఉదయం 11 గంటలకు 22.84 శాతం పోలింగ్ నమోదయింది. తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం తార్నాక కమ్యూనిటీ హాల్ పోలింగ్ బూత్ 195లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే గండ్ర



వెంకటరమణా రెడ్డి ఓటు వేశారు. వరంగల్ అర్బన్ ఖిలావరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలోని 231 పోలింగ్ బూత్‌లో వరంగల్ టీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పసునూరి దయాకర్ కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సిద్ధిపేట జిల్లా చింతమడకలో ఓటు వేశారు. ఎర్రవల్లిలోని ఫాంహౌస్ నుంచి రోడ్డు మార్గాన నేరుగా పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు వేసిన వెంటనే మీడియాతో మాట్లాడకుండానే ఆయన వెళ్లిపోయారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, ఆయన సతీమణి శైలిమ బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

తెలంగాణలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని, ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్ లో పాల్గొంటున్నారని డీజీపీ మహేందర్ రెడ్డి తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలోనూ ప్రశాంతంగా పోలింగ్ జరుగుతోందన్నారు. బేగంపేటలోని కుందన్‌బాగ్ చిన్మయ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

సంగారెడ్డి జిల్లా కొహిర్ మండలం గురుజాడలో 225 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరయించడంతో పోలింగ్ చాలా ఆలస్యంగా ప్రారంభమైంది. మెదక్ రామయంపేట్ మండలంలోని కొనపూర్‌లోనూ ఈవీఎలం మొరయించాయి. సిద్ధిపేట జిల్లా మద్దూరు నుండి చేర్యాల మండలంలో కలపాలని పోలింగ్‌ను అర్జునపట్ల గ్రామస్తులు బహిష్కరించారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో ఉదయం 9 గంటలకు 10.6 శాతం పోలింగ్ నమోదయింది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియెజకవర్గం కరకగూడెం మండలంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు ఓటు వేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దంపతులు ఓటు హక్కును వినినియోగించుకున్నారు.

నారాయణపేట నియోజవర్గంలో 15 శాతం, మక్తల్ నియోజకవర్గం 9.2 శాతం పోలింగ్ నమోదయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం లచ్చగూడెం గ్రామస్థులు ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించారు. కలెక్టర్ వచ్చి పోడు భూమి పట్టాల సమస్య పరిష్కారానికి హామీ ఇస్తేనే ఓటింగ్‌లో పాల్గొంటామని స్పష్టం చేశారు. జూలూరుపాడు మండలంలోని సూరారం గ్రామంలో సమస్యలు పరిష్కరించివరకు ఓటింగ్ ప్రక్రియ జరిగేది లేదని భీష్మించుకున్న గ్రామస్థులు. స్థానిక సమస్యలు పరిష్కరించటంలేదని, అంతర్గత రోడ్లు లేని కారణంతో చర్ల మండలంలోని సి. కత్తిగూడెం 76/119 పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేయడానికి ప్రజలు నిరాకరించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు గ్రామస్తులతో చర్చలు జరిపారు. రహదారి నిర్మాణం విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లటంతో శాంతించిన గ్రామస్తులు అనంతరం ఓటింగ్ లో పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా నవిపేట్ మండలం పోతంగల్‌లో క్యూలైన్‌లో నిలబడి టీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల కవిత, తన భర్తతో కలిసి ఓటు వేశారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం తన సొంత



గ్రామం పోచారంలో సతీమణి పెరిగే పుష్పామ్మతో పాటు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మెదక్ టీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పోతారం గ్రామంలో కుటుంబ సమేతంగా వెళ్లి ఓటు వేశారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో బూత్ ఏజెంట్లు లేటుగా రావడంతో ఆలస్యంగా రావడంతో మొదలైంది. దీంతో ఓటర్లు ఆందోళనకు దిగారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధి జయమ్మ కాలనీలో ఈవీఎంలు పనిచేయకపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మంచినీళ్లు కూడా లేవని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కేంద్రంలోని లక్ష్మీదేవి పల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జనసేన పార్టీ పార్లమెంట్ అభ్యర్థి నరాల సత్యనారాయణ తన ఓటు వినియోగించుకున్నారు.



జూనియర్ ఎన్టీఆర్, కుటుంబీకులు జూబ్లీహిల్స్ ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. హీరో అల్లు అర్జున్, సినీ నటుడు పోసాని కృష్ణమురళి క్యూలెనులో నిలబడి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు వేస్తేనే మనకు ప్రశ్నించే అధికారం ఉంటుందని అల్లు అర్జున్ అన్నారు. టీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ కరీంనగర్‌లో ఓటు వేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం కమ్మరపల్లిలో ఈవీఎం మొరాయించింది. కాంగ్రెస్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, తన భార్యతో కలిసి బంజారాహిల్స్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. మహబూబ్‌నగర్ కలెక్టర్ బంగ్లా సమీపంలోని పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ రోనాల్డ్ రోస్ దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు తరలివస్తున్నారు. పలు చోట్ల ఈవీఎం మొరాయించడంతో చిన్నచిన్న సమస్యలు తలెత్తాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రహీంఖాన్ పేటలో బూత్ నెంబర్ 1లో ఈవీఎంలు మొరాయించాయి. గంభీరావుపేటలోని బూత్ నెంబర్ 57లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.


తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ ఉదయం 5.30 గంటల నుంచి మాక్ పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ సాఫీగా ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలింగ్‌ను జిల్లా ఎన్నికల అధికారి పి. వెంకట్రామ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## పలుచోట్ల మొరాయించిన వి.వి.ఎంలు, బారులు తీరిన ఓటర్లు

### - 11 గంటలనుండి ఊపందుకున్న ఓటింగ్ - 6 గంటలకు నియోజకవర్గం మొత్తం 68.48 శాతం పోలింగ్



యలమంచి : యలమంచిలి నియోజక వర్గంలో 243 పోలింగ్ బుతుల్లో సుమారు 68.48 శాతం వి.వి.ఎంలు మాక్‌పోల్ వరకు బాగా పనిచేసిన ఓటుంగ్ ప్రారంభించే సమయంలో మొరాయించడంతో గంటల తరబడి ఓటర్లు బారులు తీరి నుంచోవలసి వచ్చింది ఒకే పాఠశాలలో మూడు పోలింగ్ బుతులు ఏర్పాటు చేయడంతో మహిళల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఉదయం 5.30 ప్రారంభిస్తానన్న మాక్‌పోల్ కొని బూతులలో ఉదయం 8 అయిన పూర్తికాలేదు. దీనికి తోడు వి.వి.ఎంలు మొరాయించడంతో లైనులో



నుంచిన్న ఓటర్లు అశహనానికి గురై వెనుతిరిగారు. వి.వి.ఎంల పనితీరుపై మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ఎన్నికల అధికారి సుర్యానారాయణరెడ్డికి పిర్యాదు చేయగా సంబందిత ఇంజినీరులను పంపించి రీపేర్ చేయించారు. నియోజకవర్గంలో చెదురు మదురు సంఘటనల మినహా ఇప్పటి వరకు పోలింగ్ ప్రశాంతంగానే జరుగుతున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఎప్పటి కప్పుడు అభ్యర్థిలు పోలింగ్ బూతులలో వి.వి.ఎంల పనితీరు ఓటింగ్ సరళిని గమనించారు.




వీరిలో అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, జనసేన ఎంపీ అభ్యర్థి పార్థసారధి, వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి. రమణమూర్తిరాజు, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ ఎప్పటి కపుడు ఓటింగ్ సరళిని పరిశీలించారు. అభ్యర్థిలు తమ ఓటును వారి పోలింగ్ బూతులలో వినియోగించుకున్నారు. ఎండీవో కార్యాలయం వద్దగల పోలింగ్ భూత్‌లో వైసిపి అభ్యర్థి కన్నబాబురాజు, బాలిక ఉన్నత పాఠశాలలో ఎంపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, రాంబిల్లి మండలం కొత్తురు హైస్కూల్‌లో జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమారులు వారి ఓటు హకులు వినియోగించుకున్నారు.



## లక్ష్యం పెట్టారు... ఎవరూ లక్ష్యపెట్టలేదు

విజయనగరం: దేశంలోనే ప్రధమ స్థానంలో పోలింగ్ శాతం ఉండాలన్న లక్ష్యానికి ఆదిలోనే అధికారుల అలక్ష్యం బయట పడింది. మాక్ పోలింగ్ వరకు అంతాసవ్యంగానే జరుగుతుందని భావించిన అధికారులకు అక్కడ నుండి ఎన్నికల సిబ్బంది నుంచి వచ్చిన ఫోన్లు తడబాటును సృష్లించాయి. స్థానిక ఫూల్‌బాగ్ కాలనీ, పాదాలమ్మ గుడి, కొత్తపేట ఉన్నత పాఠశాల, జెడ్పీ స్కూల్ ఇలా ప్రతీ చోట నుంచి ఎవిఎంలు పనిచేయటం లేదన్న సమాచారం రావడంతో పరుగులు పెట్టారు. కాగా ఇటీవల ఓటుహక్కు పొందినవారికి ఓట్లు కూడా కన్పించకపోవటం..ఎక్కడ తమ ఓటువుందో తెలుసుకునేందుకు గంటల తరడబి తిరిగి చిరకు నిరాశతో వెనుదిరగడం స్పంష్టంగా కన్పించింది. గతంలో ఓటు వేసిన వారికికూడా ఈసారి చుక్కఎదురైంది. ఇక పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు అనుకున్న స్థాయిలో జరగలేదు. చీకటిలో ఓటింగ్ చేసే బూత్‌లు ఉన్నాయి. పేడ్‌మీద అభ్యర్థుల ఫొటోలు కన్పించక పోవటంతో ఎవరి ఓటువేసారో తెలియక తికమక పడ్డారు. పనిచేయని మిషన్ల మరామ్మత్ లేదా కొత్తవాటిని ఏర్పాటు చేయడంలో సుమారు మూడు గంటలవరకు కొన్నిప్రాంతాల్లో సమయం పట్టడంతో ఓటర్లు మండుటెండలో నిల్చున్నారు. ఎంతో బాధ్యతగా ఓటేద్దామనుకున్న వారికి కూడా విసుగుతెప్పించేవిధంగా ఓటింగ్ కేంద్రాలు మారాయి. చాలా పోలింగ్ కేంద్రాల్లో పిల్లలే ఓటర్లను లోపలకు పంపిచేదుకు కర్రలు అడ్డం పెట్టుకుని కన్పించారు. రాత్రి నోట్ల వర్షం కురిపించిన పార్టీలు ఓటరును పోలింగ్ కేంద్రానికి తేవడంలో విఫలమయ్యారు టి.-90లక్ష్యం ఆదిలోనే బెడిసికొట్టింది.

### జిల్లాలో 74.18 శాతం పోలింగ్

విజయనగరం: ఎన్నికల్లో 74.18 శాతం పోలింగును సాధించారు. కురుపాం 75 శాతం, పార్వతీపురం 78.3శాతం, సాలూరు 71 శాతం, బొబ్బిలి 68 శాతం, చీపురుపల్లి 79శాతం, గజపతినగరం 75 శాతం, నెల్లిమర్ల 78 శాతం, విజయనగరం 70 శాతం, ఎస్.కోట 78 శాతం, పోలింగ్ జరిగింది.


# విశాఖ నగరంలో పోలింగ్ దృశ్యమాలిక


















## ప్రజలు మార్పు కోరుకొంటున్నారు

**- వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తర నియోజకవర్గ అభ్యర్థి కె కె రాజు**



విశాఖపట్నం : గురువారం జరిగిన ఎన్నికల్లో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తర నియోజకవర్గ అభ్యర్థి కె కె రాజు గురుద్వార సమీపంలో గల ఐ డి బి ఐ బ్యాంక్ ఎదుట గల వసంత బాల విద్యా విహార్ స్కూల్ లో గల పోలింగ్ బూత్ నెంబర్ 158 లో ఉదయం గం. 9.25 లకు ఓటు వేసారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గ ప్రజలు వివేకవంతులని ప్రతి ఒక్కరూ ఎంత త్వరగా ఓటు వేద్దామా అని ఉన్నారని ఈ ఓటింగ్ సరళి చూస్తుంటే ప్రజలందరూ మార్పు కోరుకొంటున్నారని ఈ ఎన్నికల్లో వైస్సార్ పార్టీ విజయం తథ్యమన్నారు.



## ఓటరు చైతన్యంతోనే రాష్ట్రాభివృద్ధి

విశాఖపట్నం: **గురువారం జరిగిన ఎన్నికల్లో విశాఖ ఎంపీ అభ్యర్థిగా నిలిచి ఓటింగ్‌లో పాల్గొన్న శ్రీభరత్.** విశాఖలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ ముగిసింది. సాయంత్రం 6 గంటలలోపు క్యూలో ఉన్నవారికి ఓటేసేందుకు అవకాశం కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఈవీఎంలు పనిచేయక వెనక్కి వెళ్లిన ఓటర్లు మళ్లీ రావడంతో రద్దీ పెరిగింది. ఎంత రద్దీ ఉన్నా ఓటు వేశాకే తిరిగి వెళ్తామని వృద్ధులు, మహిళలు అన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ము

## భీమిలి లో ప్రశాంతం గా పోలింగ్



భీమునిపట్నం : భీమిలి లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయి. ఈ సారి ఓటర్ల లో చైతన్యం వచ్చింది ముఖ్యంగా యువత ఎక్కువ సంఖ్య లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండుతున్న ఎండల నేపథ్యం లో ఉదయం ఆరుగంటల నుండి పోలింగ్ కేంద్రాల జనాలు బారులు తీరారు . కాగా భీమిలీ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీకి చెందిన తెడ్డు రామదాసు ఉదయం 8 గంటల ప్రాంతంలో పి.ఎస్. నెం.184 లో తన వోటు హక్కుని వినియోగించుకున్నారు. అదేవిదంగా వైస్సార్ సీపీ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి అవంతి శ్రీనివాసరావు కుటుంబసమేతంగా సీ.బీఎం స్కూల్ లో పి.ఎస్. నెం.173 లో క్యూ లైన్ లో కుటుంబ సమేతంగా నిల్చొని సుమారు 2 గంటల 30 నిమిషాలు సమయంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఈవీఎంలు పని చేయక ఇబ్బంది పడుతున్నారని, మరియు వృద్ధులు , దివ్యాయంగులకు సరైన వసతులు కల్పించలేదని విమర్శించారు.జనసేన పార్టీ అభ్యర్థి పంచకర్ల నాగ సందీప్ ఎం.వీ.పి కాలనీ లిటిల్ ఏంజెల్స్ స్కూల్ లో పి.ఎస్. నెం 106 లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే తగరపువలస,భీమిలి మండలం లో కూడా ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగాయి. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బారీ ఎత్తున భద్రతా ఏర్పాటులు చేశారు.

## రాహుల్ ప్రాణాలకు పొంచి ఉన్న ప్రమాదం

దిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. అమేఠిలో నామినేషన్ వేసేందుకు రాహుల్ వెళ్లిన సమయంలో భద్రతా పరమైన ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ నేతలు కేంద్ర హోంశాఖకు లేఖ రాశారు. నామినేషన్ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సమయంలో ఓ లేజర్ లైట్ రాహుల్ తలపై పడింది. అయితే ఇది స్నైపర్ రైఫిల్ నుంచి వచ్చి ఉంటుందని నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రాహుల్‌గాంధీకి భద్రత కల్పించడంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాహుల్ మీడియాతో మాట్లాడుతున్న వీడియోను కూడా హోంశాఖకు కాంగ్రెస్ అందించింది.



ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రామణి కుమారి మరియు కుటుంబ సభ్యులు

## ఒకరికి ఓటేస్తే మరొకరికా.. అవి వదంతులే

***ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన అధికారి ద్వివేది స్పష్టీకరణ***

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా జరుగుతోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు. మొత్తం 381 ఈవీఎంలలో సమస్యలు తలెత్తాయని, వాటన్నింటికీ మరమ్మతులు చేయించినట్టు చెప్పారు. గురువారం మధ్యాహ్నం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడారు. ఒకరికి ఓటు వేస్తే మరొకరికి వెళ్లింది అనేవన్నీ వదంతులేనని స్పష్టంచేశారు. ఈ విషయంపై ఏ ఒక్కరి నుంచి కూడా అభ్యంతరాలు రాలేదన్నారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న వారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తామని స్పష్టంచేశారు. గడువులోపు వచ్చిన వారికి ఎంత రాత్రి అయినా ఓటు వేసే అవకాశం ఇస్తామన్నారు. తాడిపత్రిలో రెండు పార్టీల మధ్య ఘర్షణలు తలెత్తాయని, అక్కడ పోలింగ్ నెమ్మదిగా సాగుతోందన్నారు. ప్రస్తుతం అన్నిచోట్లా ఈవీఎంలు పనిచేస్తున్నాయని, ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని సరిచేసేందుకు సిబ్బందిని అందుబాటులోనే ఉంచినట్టు తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 20 చోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నట్టు వెల్లడించారు. ఈ ఘర్షణల్లో ఒకరు మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయన్నారు. ఘర్షణలకు పాల్పడిన అందరిపైనా కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.



అనకాపల్లి వైఎస్ఆర్ సిపి అసెంబ్లీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.



అనకాపల్లి వైఎస్ఆర్ సిపి ఎంపీ అభ్యర్థి డాక్టర్ సత్యవతి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటు వేసేందుకు వెళ్తున్న అనకాపల్లి స్వతంత్ర్య అభ్యర్థి కొణతాల సీతారాం .



విశాఖ ఉత్తర నియోజక వర్గం వైస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె కె రాజు మరియు ఉత్తర నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు రైల్వే న్యూ కాలనీ ,తాటిచెట్ల పాలెం ప్రాంతాలలో పోలింగ్ సరళని పరిశీలిస్తున్న దృశ్యం

## ఎన్నికల విధుల్లో డ్రోన్లు

న్యూఢిల్లీ: ఈ మధ్య కాలంలో డ్రోన్ల వినియోగం విరివిగా పెరుగుతోంది. వ్యవసాయం, రక్షణ రంగాల్లో వీటిని విపరీతంగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లోనూ ఎన్నికల సంఘం వీటిని సమర్థంగా వినియోగించుకుంటోంది. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత దృష్ట్యా డ్రోన్ల సహాయాన్ని తీసుకోవాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్‌లోని గౌతమబుద్ధ నగర్ నియోజకవర్గ పరిధిలో భద్రతా బలగాలతో పాటు డ్రోన్ కూడా విధులు నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 163 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని గౌతమ బుద్ధ నగర్ జిల్లా మెజిస్ట్రేట్ తెలిపారు. దీంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లలో భాగంగా భారీ ఎత్తున బలగాలతో పాటు 13 డ్రోన్ల సాయాన్నీ తీసుకుంటున్నామన్నారు. దీంతో గగనతల నిఘా ద్వారా అవాంఛనీయ ఘటనలకు ముందే గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే నక్సల్ ప్రభావిత ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలోనూ ఈసారి భారీ ఎత్తున డ్రోన్లను వినియోగించనున్నట్లు సమాచారం. పోలింగ్ సిబ్బందికి రక్షణగా పహారా కాయడం కోసం ఇక్కడ హెలికాప్టర్లు ఉపయోగిస్తూ వస్తున్నారు.

## 17 నుంచి శ్రీవారికి వసంతోత్సవాలు



తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామివారికి ఈ నెల 17 నుంచి 19 వరకు వసంతోత్సవాలు తితిదే నిర్వహించనుంది. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి తిరువీధుల్లో ఊరేగుతూ వసంత మండపానికి వేంచేయనున్నారు. ఇక్కడ వసంతోత్సవ అభిషేకం పూర్తయిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంటారు. రెండో రోజు 18న ఉభయ దేవేరులతో కలిసి ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య స్వర్ణరథాన్ని అధిరోహించి తిరువీధుల్లో ఊరేగనున్నారు. అనంతరం వసంత మండపంలో అర్చకులు వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. చివరిరోజు 19న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి వారితో పాటు శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి, రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి మందిరానికి వేంచేయనున్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి 6.30 గంటల వరకు ఆస్థానం చేపడతారు. వసంతోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 17న సహస్రకలశాభిషేకం, 18న తిరుప్పావడ సేవ, 19న నిజపాద దర్శనం సేవలను రద్దు చేస్తున్నట్లు తితిదే తెలిపింది.






VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com